ఈనాడు
సిద్దిపేట
మంగళవారం అక్టోబరు 22, 2024



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనూరాధ, అధికారులు

నిరంతరం శ్రమించే పోలీసులు సమాజానికి స్ఫూర్తి



పూలు సమర్పిస్తున్న పోలీసులు

సిద్దిపేట, సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: విపత్కర, క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయక పోలీసులు విధుల నిర్వర్తిస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న ఎంతో మంది స్ఫూర్తిగా నిలుస్తున్నారని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లోని పరేడ్ మైదానంలో పోలీసు కమిషనర్ అనూరాధతో కలిసి ఘన నివాళి అర్పించారు. గౌరవ వందనం స్వీకరించారు. పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. రిజర్వు ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, ఆర్ఎస్ఐలు సాయిప్రసాద్, బాలకృష్ణ ఆధ్వర్యంలోని బృందం స్మృతి పరేడ్, గౌరవ వందనం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. ఎంతో మంది త్యాగమూర్తుల ఫలితమే శాంతియుత సమాజమని వివరించారు. అమరుల కుటుంబ సభ్యులను సత్కరించారు. అదనపు డీసీపీలు మల్లారెడ్డి, రామచందర్‌రావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, అంజయ్య, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్‌గౌడ్, శ్రీధర్, జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని కలెక్టర్ మనుచౌదరి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఒకమొక్కను సీపీ అనూరాధ అందించారు. కమాండ్ కంట్రోల్ రూమ్, ఐటీసెల్, స్పెషల్ బ్రాంచ్ కార్యాలయం, సైబర్ పోలీస్ క్రైమ్ స్టేషన్, సీసీఆర్బీ కార్యాలయం, ట్రాఫిక్ కంట్రోల్‌రూమ్, గ్రీవెన్స్ హాల్, వీడియో కాన్ఫరెన్సు హాళ్లను పరిశీలించారు. మెరుగైన సేవలు అందిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు.



గౌరవ వందనం చేస్తూ..

ఓటు నమోదు చేసుకోండి



కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

త్వరలో జరగబోయే మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించి ఫ్లెక్సీని కలెక్టరేట్ ఆవరణలో అధికారులు ఏర్పాటు చేశారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ఇందుకోసం ఏమేం అవసరమో సూచిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్:

పట్టణాభివృద్ధికి సహకరించండి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఇంటిపన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని సిద్దిపేట బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ అన్నారు. ఇంటిపన్నుల వసూలుకు బిల్ కలెక్టర్లతో కలిసి సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న ఓ రెండు ఇళ్లకు సంబంధించి రూ.3,31,150 పన్ను వసూలు చేశారు. ఆయన వెంట బల్దియా సిబ్బంది శ్రీకాంత్, రాజు, తదితరులు ఉన్నారు.

50 శాతం సిలబస్.. డిసెంబరు 31 లక్ష్యం



న్యూస్‌టుడే, సిద్దిపేట: పదో తరగతి.. విద్యార్థి జీవితంలో కీలక మలుపైన పదో తరగతి చదివే బాలబాలికల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని విద్యా శాఖ ప్రణాళికాయుతంగా తరగతులు నిర్వహిస్తోంది. సకాలంలో బోధన పూర్తి చేసి పునశ్చరణ తరగతులు ప్రారంభించాలని యోచిస్తోంది. ఈసారి సర్కారు బడుల్లో ద్విభాషా పుస్తకాలు రావడం, ఇతరత్రా కారణాలతో వేగంగా సిలబస్ పూర్తి చేయడంలో వెనుకబడ్డారు. సిద్దిపేట జిల్లా.. పాఠశాల విద్యలో మేటిగా నిలుస్తోంది. ఏటా వెలువడే 'పది' వార్షిక ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలుస్తోంది. గత విద్యా సంవత్సరంలో 98.65 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈసారి శతశాతం ప్రత్యేకతను చాటేందుకు సిద్ధమయ్యారు. అందుకు తొలుత సిలబస్ పూర్తి చేయాలని నిర్ణయించగా ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో మొత్తం 12,965 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు.

పదో తరగతి విద్యార్థులు	
జడ్పీ, ఉన్నత	221
గురుకులాలు	35
కేజీబీవీ	22
ఆదర్శ	14
ఎయిడెడ్	1
ప్రైవేటు	104

బదిలీలు, పదోన్నతులతో వెనుకబాటు

విద్యా సంవత్సరం ఆరంభంలోనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొంత వెనుకబాటుకు గురిచేసింది. గత ఏడాది వరకు ఒకే మాధ్యమంలో పాఠ్య పుస్తకాలు అందించే వారు. ఈసారి మాత్రం పదో తరగతికి కూడా ద్విభాషా పుస్తకాలు పంపిణీ చేయడం ఆరంభించారు. మొదటి భాగం పుస్తకాలు జూన్ 11వ తేదీలోపు చేరాయి. రెండో భాగం సంబంధించి దసరా సెలవుల్లో మండల వనరుల కేంద్రాలకు చేరాయి. కొన్నిచోట్ల ఇంకా అందిస్తున్నారు. ఫలితంగా 50 శాతం మేర సిలబస్ పూర్తయింది. గత ఏడాదిని పరిగణనలోకి తీసుకుంటే ఇప్పటికే 65 శాతం బోధన పూర్తయ్యేది. ప్రస్తుతం ఎస్ఏ-1 పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రత్యేక తరగతుల ద్వారా సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

సర్కారు బడుల్లో 9 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులు నిర్వహించనున్నారు. సన్నద్ధతలో భాగంగా వారాంతపు పరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించారు. నూతన ఉపాధ్యాయులు నియామకమైన నేపథ్యంలో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతకు తావులేకుండా దృష్టి సారించారు. ఉద్యోగ విరమణ పొందుతున్న వారిస్థానాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటు పాఠశాలల్లో 85 శాతం మేర పాఠ్యాంశాల బోధన జరిగింది. సంబంధిత అంశంపై జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. డిసెంబరు మాసాంతంలోపు పాఠ్యాంశాల బోధన పూర్తి చేస్తామన్నారు. నవంబరు నుంచి ప్రత్యేక తరగతులు మొదలెడతామన్నారు. జనవరి నుంచి పునశ్చరణ తరగతులు ప్రారంభిస్తామన్నారు.

'స్వీప్'పై సమీక్ష

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఓటరు జాబితా సవరణ 2024-25కు సంబంధించి ప్రణాళికాబద్ధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు రూపకల్పనపై హైదరాబాద్ నుంచి సోమవారం ఆయన అన్ని జిల్లాల పాలనాధికారులతో దృశ్యసమీక్ష నిర్వహించారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, స్వీప్ నోడల్ అధికారి జయదేవ్‌ఆర్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహనకు కృషి: డీఈవో

సిద్దిపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన, వైజ్ఞానిక స్పృహను పెంపొందించడమే లక్ష్యంగా ఏటా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా సహకారంతో చెకుముకి సైన్స్ సంబురాలు నిర్వహించడం అభినందనీయమని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో నవంబరు 7 నుంచి జిల్లా ప్రతిభా పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో సంబంధిత గోడప్రతులను సోమవారం విడుదల చేశారు. వేదిక రాష్ట్ర కార్యదర్శి మహేందర్, సభ్యులు, జిల్లా గౌరవ అధ్యక్షుడు నర్సింలు, కార్యదర్శి మహేందర్, సెక్టోరియల్ అధికారి రామస్వామి, జిల్లా సైన్స్ అధికారి కె.శ్రీనివాస్, ఎంఈవో రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

అందరికీ బ్యాంకు ఖాతా, జీవిత బీమాయే లక్ష్యం

చేర్యాల, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ బ్యాంకులో ఖాతా కలిగి ఉండటంతో పాటు అందరికీ జీవిత బీమా సౌకర్యం కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా లీడ్ మేనేజరు బోయ హరిబాబు అన్నారు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆర్థిక సేవల విభాగం ఆదేశాలతో చేర్యాల మండలం ఆకునూరులో సోమవారం 'జన సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం రూ.20 చెల్లించి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై) కింద సంవత్సరానికి రూ.2లక్షల ప్రమాదబీమా సదుపాయం పొందవచ్చునని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై) పథకంలో భాగంగా రూ.426 చెల్లించి సంవత్సరానికి రూ.2లక్షల జీవిత బీమా పొందవచ్చునన్నారు. 'యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'లో ఖాతా కలిగిన వారు కేవలం రూ.404 చెల్లించి రూ.30లక్షల ప్రమాదబీమా చేసుకోవచ్చునని వివరించారు. సైబర్ మోసగాళ్ల బారిన పడినపుడు 1930కి ఫోన్ చేసి చెప్పాలన్నారు. నాబార్డు జిల్లా ప్రతినిధి నిఖిల్ రెడ్డి, చేర్యాల అంగడి బజారు ఎస్‌బీఐ శాఖ మేనేజరు పాతం అనీశ్, కేపీఆర్ కాలనీ ఫీల్డ్ అధికారి సురేశ్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు శోకం



దుబ్బాక ఏఎంసీలో తడిసిన ధాన్యం



సిద్దిపేట మార్కెట్‌లో వర్షపు నీటిలో తేలియాడుతున్న వడ్లు



సిద్దిపేట ఏఎంసీలో వడ్ల మధ్య కాలువ కట్టిన వరద



సిద్దిపేట కూడలిలో వాన నీటిలో ప్రయాణం

సిద్దిపేట టౌన్, చిన్నకోడూరు, మిరుదొడ్డి, దుబ్బాక, హుస్నాబాద్ గ్రామీణ, హుస్నాబాద్, న్యూస్‌టుడే: సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జిల్లాలో ఎండ కాచింది. అనంతరం ఒక్కసారిగా సాయంత్రం వాన పడటంతో పొలాల్లో పంటలు, మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన వడ్లు, మక్కలు వర్షార్పణమయ్యాయి. అన్నదాతలు నష్టపోయి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చిన్నకోడూరులో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. చెల్కలపల్లిలో రైతు కొలనుపాక కనకారెడ్డి. . పోతారం(ఎస్)లో భైరి లక్ష్మికి చెందిన పాడ ఆవులు రెండూ పిడుగుపాటుకు చనిపోయాయి. సిద్దిపేట అర్బన్- 3.9 సెం.మీ, మిరుదొడ్డి, నారాయణరావుపేట - 3.6, చిన్నకోడూరు-2.3, అక్కన్నపేట- 1.5, జగదేవపూర్ - 1.3, కోహెడ - 1.2, దుబ్బాక- 1.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

● సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో గంట పాటు వాన కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి.

● కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా తూకాలు మొదలు కాకపోవడంతో రైతులు తెచ్చిన ధాన్యం కొట్టుకుపోయింది.

● పోతారం(ఎస్)లో విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలోని తాటిచెట్లపై పిడుగు పడటంతో మంటలు లేచాయి.



చెల్కలపల్లిలో ఒరిగిన పంట



సిద్దిపేట ఏఎంసీ నుంచి కొట్టుకుపోయి పక్కన ఖాళీ స్థలంలో పేరుకున్న ధాన్యం, మక్కలు



పెద్దకోడూరులో నేలవాలిన వరి



దుబ్బాక: ఎత్తిపోస్తున్న రైతు

పిడుగుపాటుకు మహిళ మృతి



లక్ష్మి

తొగుట: తొగుట మండలం ఎల్లారెడ్డిపేట శివారులో సోమవారం పిడుగు పడటంతో గుట్టపై రాళ్లు కొడుతున్న బోదాసు లక్ష్మి(54) అక్కడికక్కడే మృతి చెందారు. సమీపంలోనే ఉన్న భర్త మల్లయ్య స్పృహ కోల్పోయి కొంతసేపటికి తేరుకొని లేచి చూసేసరికి భార్య చనిపోయి ఉంది. మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎస్ఐ రవికాంతరావు కేసు నమోదు చేశారు.

పసికందును అమ్మకానికి తెచ్చిన తల్లి



ఇందుప్రియాల్‌లో తల్లి, బిడ్డను అధికారులకు అప్పగిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: 20 రోజుల పసిపాపను అమ్మడానికి తెచ్చిన తల్లిని పట్టుకొని ఇద్దరినీ సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ ఘటన దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ అటవీ ప్రాంతంలో సోమవారం చోటుచేసుకుంది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ తెలిపిన వివరాలు.. గజ్వేల్ పట్టణంలోని పల్లెపహాడ్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన మహిళ తనకు పుట్టిన రెండో ఆడబిడ్డను అమ్మకానికి పెట్టింది. ఇందుప్రియాల్‌కు ద్విచక్ర వాహనంపై ఇతరులతో కలిసి వచ్చి బేరం చేసుకుంటోంది. ఇది గొడవకు దారితీసింది. అక్కడున్న గొర్రెల కాపరులు చూసి అక్కడకు వెళ్లారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు పారిపోయారు. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త సుల్తానాకు కాపరులు సమాచారం ఇవ్వగా సూపర్‌వైజర్, బాలల సంరక్షణ అధికారులు వచ్చి సిద్దిపేటలోని సఖి కేంద్రానికి తరలించారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన: ఎమ్మెల్యే

దుబ్బాక, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న పాలన ఇందిరమ్మ రాజ్యంలా లేదని, ఎమర్జెన్సీ పాలనలా ఉందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. గ్రూప్-1 పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో భారాస ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు అడ్డుకుంటారనే ముందస్తు సమాచారంతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమను నియోజకవర్గాలకు వెళ్లకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గృహ నిర్బంధం చేయడం సరికాదన్నారు.

ప్రజావాణికి 50 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 50 దరఖాస్తులు సమర్పించారు. వాటిని పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆయా శాఖల అధికారులకు బదిలీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో జయదేవ్‌ఆర్య, డీఆర్వో నాగరాజమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటికి సంబంధించి ధ్రువపత్రం ఇప్పించాలని గుండ్లచెరువు ప్రాంతానికి చెందిన నాగరాజు, అనూష దంపతులు కోరారు.

● పెద్దకుమారుడు, కోడలు తమను సరిగా చూడటం లేదని రాయవరం గ్రామానికి చెందిన వొట్టెల ఐలయ్య, ఐలమ్మ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.

● మహిళా సంఘాన్ని రిజిస్టర్ చేసి, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని నంగునూరు మండలం జేపీతండా గ్రామమహిళలు అర్జీ సమర్పించారు.

● రెండు పడకగదులు మంజూరైనప్పటికీ ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని హుస్నాబాద్ మండల కేంద్రానికి చెందిన పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.



కుమారుడు, కోడలు సరిగా చూడటం లేదని వాపోతున్న దంపతులు

ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: సంగారెడ్డిలోని జూబ్లీ క్లబ్-ఎంఎస్ అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబరు 4న సంగారెడ్డి, వరంగల్‌లో ప్రారంభమయ్యే అండర్-23 అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనే జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన క్రీడాకారులతో నాలుగు జట్లను ఎంపిక చేశామని, ఇందులో అత్యుత్తమ ప్రతిభ చాటిన వారితో తుది జట్టును ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మధుమోహన్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, శిక్షకులు చంద్రమౌళి, ఇనాం ఉర్ రహమాన్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడి వీరంగం

దుబ్బాక, న్యూస్‌టుడే: దుబ్బాక పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో మతిస్థిమితం లేని యువకుడు వీరంగం సృష్టించాడు. శిలాజినగర్ గ్రామానికి చెందిన యువకుడు ఎంపీ రఘునందన్‌రావు క్యాంపు కార్యాలయం బయట నిలిపి ఉంచిన ప్రచార రథం వాహన అద్దాలను ధ్వంసం చేశాడు. దుబ్బాక బస్టాండ్ వెనుక దారిలో నిలిపి ఉంచిన ఆటో, అంబులెన్స్, మరో వాహనం అద్దాలను పగులగొట్టాడు. అనంతరం వీధి దీపాల స్టార్టర్ డబ్బా, సీసీ కెమెరాల వైర్లను తొలగించాడు. ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

కొబ్బరికాయ.. ధర పెంచేయ్?

'మల్లన్న' సన్నిధిలో వేలం హక్కుదారుల ఇష్టారాజ్యం

న్యూస్‌టుడే, చేర్యాల: దేవుని దర్శనానికి వెళ్లే ప్రతి భక్తుడు కొబ్బరికాయ కొట్టడం సర్వసాధారణం. అంది ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా భావిస్తారు. తమ ఇలవేల్పుకు మొక్కు చెల్లించుకునే ప్రధాన కార్యమిది. దీన్ని సైతం అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం వద్ద భక్తుల నిలువు దోపిడీ మరింత పెరిగిపోయింది. సాధారణంగా బ్రహ్మోత్సవాల సమయంలోనే ఇలాంటివి జరిగేవి. కాని ఇప్పుడు మామూలు రోజుల్లోనూ తప్పడం లేదు. కొబ్బరికాయల విక్రయంలో అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఆలయ నిబంధనల్ని తుంగలో తొక్కి గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నియంత్రించాల్సిన ఆలయ వర్గాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు అక్రమానికే పరోక్షంగా మద్దతు పలుకుతున్నారు. ఒక్కో టెంకాయను గతంలో ఎన్నడూ లేని విధంగా అధిక ధరకు విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏడాది పొడవునా కేవలం రూ.30లకు మించి విక్రయించరాదు. ఈ మేరకు బహిరంగ వేలం రోజునే ఒప్పందంపై సంతకం చేశాకే, ఆలయం ఎదుట కొబ్బరికాయల అమ్మకానికి అనుమతి పత్రం జారీ చేస్తారు. స్థానికంగా రూ.40లకు విక్రయిస్తున్నారు. ప్రతి భక్తుడికీ రెండు కొబ్బరికాయలు అంటగడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే సరైన సమాధానం లేకుండా వేలం ద్వారా రూ.లక్షలు చెల్లించి హక్కులు దక్కించుకున్నామంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు.



ప్రసాదాల విక్రయ కేంద్రం గోడకు రాసిన ధర వివరం

నియంత్రణ చర్యలు తీసుకుంటా: ఆలూరు బాలాజీ, ఈవో, కొమురవెల్లి ఆలయం

నిబంధన ప్రకారం ఒక్కో టెంకాయ కేవలం రూ.30కే విక్రయించాలి. అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు. వాస్తవ ధరను ప్రచారం చేసి నియంత్రిస్తా.

స్వల్పకాలం.. దిగుబడి ఖాయం

ఆలు సాగులో మెలకువలతో..



బోదెల్లో నాటుతున్న విత్తనం

న్యూస్‌టుడే, జహీరాబాద్

ఆలుగడ్డ శీతాకాలంలో పండించే స్వల్పకాలిక పంట. తక్కువ నీరే అవసరం ఉంటుంది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో దీన్ని సాగు చేస్తుంటారు. అక్టోబరు, నవంబరు నెలలు సాగుకు అనుకూలం. విత్తనం నాటినప్పటి నుంచి కోతకు వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జహీరాబాద్‌లోని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె.శైలజ ఇలా వివరించారు.

లోతు దుక్కితో..: పొలాన్ని లోతుగా దున్ని బాగా ఎండనివ్వాలి. దీనివల్ల నేలలో ఉండే శిలీంధ్రాలు, కలుపు గింజలు చనిపోతాయి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 నుంచి 12 టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల మలాథియాన్ పొడి చల్లి కలియదున్నాలి.

శుద్ధి తప్పనిసరి: 20 నుంచి 30 గ్రా. బరువున్న దుంపలను విత్తనంగా వినియోగించాలి. వెలుతురు ఉన్న ప్రదేశంలో ఒక రోజు ఆరబెట్టాలి. దుంపను రెండు, మూడు ముక్కలుగా కోసి లీటరు నీటిలో 2 గ్రా. చొప్పున మాంకోజెట్ కలిపి 10 నిమిషాలు నానబెట్టాలి. ఆ తర్వాత గోనె సంచులు కప్పి 24 గంటలు ఆరబెట్టాలి. 50 సెం.మీ. దూరం పాటిస్తూ బోదెలు తవ్వి నాటాలి.

● నత్రజని 16 కిలోలు, భాస్వరం 24 కిలోలు, పొటాష్ 20 కిలోలు ఎకరాలో బోదెల వెంట వేయాలి. అజోస్పైరిలమ్, పాస్ఫోబ్యాక్టీరియా 2 కిలోల చొప్పున పశువుల ఎరువుతో కలిపి వేస్తే తెగుళ్ల బెడద ఉండదు. విత్తిన 30 రోజులకు 16 కిలోల నత్రజని, 20 కిలోల పొటాష్ వేసి మన్ను ఎగదోసి నీరు అందించాలి. 50 రోజులకు ఇదే మోతాదులో వాడాలి.

నీటి తడులు..: విత్తనం నాటిన ఐదారు రోజుల్లో 2, 3 తడులు అందిస్తే బాగా మొలకెత్తుతాయి. లేదంటే పొటాటో ట్యూబర్‌మాత్ బెడద తీవ్రం అవుతుంది. మొక్క పెరిగే దశలో 7, 8 రోజులకో సారి, దుంప ఏర్పడే దశలో 4, 5 రోజులకోసారి నీరు పారించాలి.

విత్తన రకాలు

కుఫ్రి చంద్రముఖి: గడ్డ గోధుమ రంగులో ఉంటుంది. పంట కాలం 90 నుంచి 95 రోజులు.

కుఫ్రి లవకర్: స్వల్పకాలిక రకం. దుంప తెల్లగా ఉండటమే కాకుండా 70 నుంచి 75 రోజుల్లో పంట చేతికొస్తుంది.

కుఫ్రి జ్యోతి: ఈ రకం విత్తనం మధ్యకాలిక రకం. దుంప తెల్లగా ఉంటూ ఎర్లిబ్లైట్, లేట్‌బ్లైట్ తట్టుకుంటుంది. పంట కాలం 90 నుంచి 100 రోజులు.

రైతేరాజు

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం:
93815 15588

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తొర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: పత్తి ఆకుల ఈనెలు నల్లగా మారుతున్నాయి. ఏం చేయాలి? – విజయ్, గజ్వేల్

సమాధానం: కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.లు, స్ట్రెప్టోసైక్లిన్ 2 గ్రా.ల మందును 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. పైరు ఎదుగుదలకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ మొక్కలకు అందిస్తే ఫలితం ఉంటుంది. – న్యూస్‌టుడే, చేర్యాల

మామిడిలో చెదల నివారణ

మామిడి తోటల్లో అక్టోబరు చివరి, నవంబరు మొదటి వారం నుంచి పూత రావడం ప్రారంభం అవుతుంది. దీనికితోడు చెదలు పట్టడం, క్రిమికీటకాలు చేరడమూ మొదలవుతుంది. ఈ దశలో పూతను సకాలంలో సంరక్షించుకుంటే అధిక దిగుబడులు సాధ్యం. చెదలు పట్టడం, క్రిమికీటకాల బెడద నుంచి బయటపడేందుకు 100 లీటర్ల నీటిలో 8 కిలోల రాళ్ల సున్నం, 3 కిలోల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా క్లోరోపైరిఫాస్ మందు కలిపి ఒక రోజు మందు నానబెట్టాలి. ఇలా తయారైన మిశ్రమాన్ని చెట్టు కింది నుంచి రెండున్నర అడుగుల మేర మొదలు చుట్టూ పూయాలి. చెట్టుకు అవసరమైన వేడి అందుతుంది.

– న్యూస్‌టుడే, పాపన్నపేట

బెండలో అంతరకృషితో ఫలితం

బెండ తోటలో కలుపును సకాలంలో తొలగించకపోతే పంట నష్టపోక తప్పదు. విత్తనాలు వేయగానే ఎకరాకు పెండిమిథాలిన్ 30 శాతం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 25 రోజుల తర్వాత గొర్రు లేదా గుంటకతో అంతర కృషి చేసుకోవాలి. దీనివల్ల కలుపును సులువుగా నివారించుకోవచ్చు.

– న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట

నిమ్మలో గజ్జి తెగులా..

వాతావరణంలో వస్తున్న మార్పులతో నిమ్మ తోటకు గజ్జి తెగులు ఆశిస్తుంది. దీనివల్ల పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వానలతో ఈ తెగులు తోటంతా త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దీన్ని గుర్తించగానే సోకిన కొమ్మలను కత్తిరించి కాల్చేస్తే వ్యాప్తి చెందకుండా ఉంటుంది. నివారణకు పది లీటర్ల నీటిలో ఓ గ్రాము స్ట్రెప్టోసైక్లిన్, 30 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్ కలిపి 20 రోజులకోసారి వర్షాలు పూర్తిగా తగ్గే వరకు పిచికారీ చేసుకుంటే ఫలితం ఉంటుంది.

– న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ

వేరుసెనగ పంట... లాభాలు ఇంట



సాంకేతిక పరిజ్ఞానం పాటిస్తూ, అధికారుల సూచనలతో ముందుకు సాగితే ఏ పంటలోనైనా అధిక లాభాలు ఖాయం. ఈ బాటలో నడుస్తూ వేరుసెనగ పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు ధారూర్ మండలం ధారూర్ స్టేషన్‌కు చెందిన పాండు. 25 ఏళ్ల కిందట ఈయన తాత దీన్ని సాగు చేయగా.. అదే సంప్రదాయాన్ని ఈయన సైతం కొనసాగిస్తున్నారు. ఈయనకు ఆరెకరాల పొలం ఉంది. ప్రతి సారి దీన్ని సాగు చేసే ముందు జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువు పంటలను వేస్తారు. ఇవి ఏపుగా పెరిగాక కలియదున్నుతారు. దీనివల్ల భూసారం పెరిగి అధిక దిగుబడి వచ్చేందుకు దోహదపడుతోంది.

ఎకరాకు రూ.30 వేలు..

ఎకరాకు 70 కిలోల చొప్పున 6 ఎకరాలకు 420 కిలోల విత్తనం అవసరం అవుతోంది. కలుపు తీత, ఎరువులు, పురుగుమందులు తదితరాలకు ఎకరాకు రూ.30 వేల వరకు ఖర్చవుతోంది. పంట పూతదశకు నెల రోజుల ముందు జిప్సం చల్లడం వల్ల ఊడలు సులువుగా భూమిలోకి వెళ్లి కాయ పరిమాణం, నూనె శాతం పెరుగుతుంది. నీటి తడులు అందించేందుకు తుంపర పద్ధతిని ఎంచుకున్నారు. అన్ని విధాల సస్యరక్షణ చర్యలు చేపడుతుండటంతో ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. మార్కెట్లో క్వింటా ధర రూ.7500 పలుకుతోంది. ఈ లెక్కన ఆరెకరాలకు కలిపి రూ.5.40 లక్షల వరకు ఆదాయం వస్తోంది. పెట్టుబడి పోగా రూ.3.60 లక్షల వరకు మిగులుతోందని పాండు తెలిపారు. – న్యూస్‌టుడే, ధారూర్



గతంలో



ప్రస్తుతం ఇలా..

వృక్ష విలాపం!

పర్యావరణ సమతుల్యానికి వృక్షాలు ఎంతో దోహదం చేస్తాయి. ఏళ్లుగా మొక్కలు నాటి రక్షిస్తుంటేనే ఇది సాధ్యమవుతుంది. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చిల్వేర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏళ్ల కిందట అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటి కంటికి రెప్పలా కాపాడారు. అవి ఏపుగా పెరిగి పిల్లలకు చల్లని నీడను అందిస్తున్నాయి. బడి రూపురేఖలను మార్చేశాయి. ఇన్నాళ్లు పచ్చదనానికి తోడ్పడిన పాఠశాల ఆవరణలోని 100కు పైగా వృక్షాలను దసరా సెలవుల్లో నరికేశారు. దీంతో కళావిహీనంగా మారింది. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. వాన కురుస్తున్నప్పుడల్లా నీళ్లు నిలిచిపోతుండటంతో మొరం పోయిస్తున్నామని, చెట్ల ఆకులు పడి చెత్తాచెదారం నిండుతోందని, అందుకే తొలగించామని చెప్పారు. మళ్లీ నాటుకోవచ్చని సమాధానం ఇచ్చారు.

– న్యూస్‌టుడే, అల్లాదుర్గం

పరస్పర సహకారంతో ప్రగతికి బాటలు

-జపాన్ సైన్స్ టెక్నాలజీ ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హాషిమోటో



కార్యక్రమంలో జపాన్ విద్యా సంస్థల ప్రతినిధులు, చిత్రంలో జపాన్ సైన్స్, టెక్నాలజీ(జేఎస్టీ) ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హాషిమోటో, ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి

సంగారెడ్డి టౌన్: పరస్పర సహకారంతో ప్రగతికి బాటలు పడతాయని జపాన్ సైన్స్, టెక్నాలజీ(జేఎస్టీ) ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హాషిమోటో పేర్కొన్నారు. జపాన్ మంత్ పేరుతో రెండు రోజుల కార్యక్రమాన్ని ఆయన ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభించి మాట్లాడారు. జపాన్ అకడమిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'జపాన్ నెల' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2014 నుంచి ఇండియాతో జేఎస్టీకి మెరుగైన సంబంధాలు ఉన్నాయన్నారు. ఇరుదేశాల మధ్య శాస్త్ర, సాంకేతిక అంశాలను ఇచ్చిపుచ్చుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. జేఎస్టీ ఆధ్వర్యంలో ఇండియాకు చెందిన యువ శాస్త్రవేత్తలకు జపాన్‌లో పర్యటించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. జపాన్‌లో చదివేందుకు వస్తున్న భారతీయుల్లో 5శాతం ఐఐటీహెచ్‌కు చెందిన వారేనని వివరించారు. ఉత్పత్తులపరంగా జపాన్ బలంగా ఉందని, ఇండియా-జపాన్ కలిసి ముందుకు సాగితే శాస్త్ర సాంకేతిక రంగాల్లో అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయన్నారు. జపాన్ మంత్‌లో భాగంగా తమ దేశానికి చెందిన 72 విద్యా సంస్థల ప్రతినిధులు హాజరైనట్లు వివరించారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ జపాన్‌తో ఐఐటీహెచ్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయని, ఇది రెండు దేశాలకు ప్రయోజనమని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అధ్యయనం

మెదక్ జిల్లాలో సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల పర్యటన



ఆవంచలో బతుకమ్మ ఆడుతున్న శిక్షణ అధికారులు

తూప్రాన్, నర్సాపూర్ రూరల్, కౌడిపల్లి, రామాయంపేట, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అమలు, వాటి సత్ఫలితాలపై అఖిల భారత సర్వీస్ శిక్షణ అధికారులు మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధ్యయనం చేయనున్నారు. సోమవారం నాలుగు మండలాల్లోని 4 గ్రామాల్లో వారి పర్యటన మొదలైంది. వారికి ఆయా గ్రామాల ప్రజలు, స్థానిక అధికారులు ఘన స్వాగతం పలికారు. నాలుగు రోజుల పాటు అక్కడే ఉండి అధ్యయనం చేయనున్నారు. ప్రజలతో మాట్లాడి పథకాల అమలు తీరుపై ఆరా తీయనున్నారు. తూప్రాన్ మండలం మల్కాపూర్‌కు ఐదుగురు అధికారులు వచ్చారు. ఆ బృందం నాయకురాలు, ఐపీఎస్ అధికారిణి సాహిత్య ఆధ్వర్యంలో వారు పర్యటించనున్నారు. తూప్రాన్ ఎంపీడీవో శేషాద్రి, డీఎల్పీవో యాదయ్య, ఎంఈవో సత్యనారాయణ తదితరులు ఉన్నారు. ● నర్సాపూర్ మండలం ఆవంచలో సోనుపర్మార్, ప్రియాంక, అరుణ్‌కుమార్ సింగ్, భోంస్లే అక్షయ్‌దినకర్, మనీష్‌కన్సాల్ క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. వారికి మంగళహారతులతో ఘనస్వాగతం పలకగా, గ్రామస్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. వైద్యురాలు ఫౌజియా, ఏపీవో అంజిరెడ్డి, ఏపీఎం గౌరిశంకర్, ఎంఈవో తారాసింగ్ తదితరులు ఉన్నారు.

● కౌడిపల్లి మండలం రాయిలాపూర్‌కు యోగేశ్‌కుమార్, హితేశ్ ఖండేల్‌వాల్, ఆశిష్‌కుమార్, మోహినుల్లా అన్సారీ, సావ్రిక్ బృందం వచ్చింది. రామాయంపేట మండలం ప్రగతి ధర్మారానికి మరో నలుగురు శిక్షణ అధికారులు వచ్చారు. ఎంపీడీవో షాజీలొద్దీన్, తహసీల్దారు రజని, ఏవో రాజ్‌నారాయణలు వారికి స్వాగతం పలికారు.

యువ పర్యాటకం.. అభివృద్ధికి దోహదం



యువతకు దేశ, రాష్ట్ర భౌగోళిక విశిష్టతలు, విభిన్న సంస్కృతులపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం.. పర్యాటక శాఖతో కలిసి యువ పర్యాటక క్లబ్‌ల ఏర్పాటుకు సంకల్పించింది. దేశంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో యువతను భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో ఈ దిశగా అడుగేసింది. వీటిల్లో చేరే వారికి సాంస్కృతిక రాయబారులుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించడం విశేషం.

న్యూస్‌టుడే, మెదక్ టౌన్, సిద్దిపేట, సంగారెడ్డి టౌన్

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సందర్శనీయ ప్రాంతాలెన్నో ఉన్నాయి. సిద్దిపేట కోమటిచెరువు, వికారాబాద్‌లోని అనంతగిరి అటవీ ప్రాంతం, మెదక్‌లో ఏడుపాయల ఆలయం, నర్సాపూర్ అటవీ ప్రాంతం, సంగారెడ్డిలో మంజీరా తదితర ప్రాంతాల సందర్శనకు నిత్యం వేలాది మంది వస్తుంటారు. వీటితో పాటు రాష్ట్రంలోని వివిధ పర్యాటక స్థలాలు, అక్కడి చారిత్రక వైభవం అధ్యయనం చేయడంతో పాటు అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా క్లబ్ సభ్యులు దోహదపడుతారు. మరోవైపు సందర్శకులకు అవగాహన కల్పించే బాధ్యత వీరిపై ఉంటుంది. నాలుగు

నాలుగు జిల్లాల్లో క్లబ్‌లు ఏర్పాటు

జిల్లా	విద్యాలయాలు	సభ్యులు
మెదక్	189	3830
సిద్దిపేట	112	2240
సంగారెడ్డి	250	2500
వికారాబాద్	130	2600



మెదక్ చర్చి వద్ద విద్యార్థులు

జిల్లాల్లో క్లబ్‌ల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది.

అన్ని విద్యాసంస్థల్లో..

ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటుచేయనున్నారు. క్లబ్‌కు పాఠశాల ప్రిన్సిపల్ అధ్యక్షుడిగా, ఉపాధ్యాయుడు/అధ్యాపకుడు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. పాఠశాలల్లో 7-9 తరగతులకు చెందిన విద్యార్థులు, కళాశాలల్లో ఆయా గ్రూప్‌లకు సంబంధించిన విద్యార్థులు 20 మంది వరకు సభ్యులుగా ఉంటారు. ప్రతి నెలా ఒకసారి సమావేశమై సభ్యులకు పర్యాటక అంశాలపై దిశానిర్దేశం చేస్తారు. ఆ నెలకు సంబంధించి ప్రణాళిక రూపొందించుకుంటారు. క్లబ్‌ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిమిత్తం జిల్లాల డీఆర్డీవోలకు ప్రత్యేకంగా లింకు పంపించారు.

నిర్వహించే కార్యక్రమాలు

● పట్టణాలు, గ్రామాలకు సమీపంలో ఉన్న పర్యాటక కేంద్రాల వరకు ట్రెక్కింగ్, సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తారు. ● వ్యాస రచన, క్విజ్, లోగో డిజైనింగ్, చిత్రలేఖనం, పోస్టర్ డిజైనింగ్ వంటి అంశాల్లో పోటీలు. ● పర్యాటకం ప్రాధాన్యంపై ఉపన్యాస పోటీలు. ● సందర్శనీయ ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడం. ● చారిత్రక, వారసత్వ ప్రాంతాల ప్రాముఖ్యతపై ప్రచారం చేయడం.



ప్రయోజనాలు ఇలా..

● వివిధ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాలపై అధ్యయనం చేయవచ్చు.

● అక్కడి ప్రజల జీవన స్థితిగతులు తెలుసుకోవచ్చు.

● యాత్రలు, అనుభూతులను కథలు, షార్ట్‌ఫిల్మ్స్‌గా మలిచే అవకాశం ఉంటుంది. పోటీ పరీక్షలకు ఉపయోగపడతాయి.

● పర్యాటకుల గైడ్‌గా పని చేసి ఉపాధి పొందే అవకాశం ఉంటుంది.


ఇదో సదవకాశం



యువ పర్యాటక క్లబ్‌ల ద్వారా పర్యాటక రంగంపై అవగాహన పెరుగుతుంది. ఈ రంగంలో స్థిరపడేందుకు ఇదో సదవకాశం. పర్యాటక ప్రదేశాలపై అధ్యయనం చేయడం వల్ల భవిష్యత్తులో పలు రకాలుగా ఉపయోగపడుతుంది.

– వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పరిశోధన ఫలాలు రైతులకు అందేలా చేస్తాం: వీసీ రాజిరెడ్డి



ములుగు: ఉద్యాన పంటలు, నూతన వంగడాలపై చేసిన పరిశోధనల ఫలితంగా వచ్చిన ఫలాలను రైతులకు అందేలా చేస్తామని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ) దండా రాజిరెడ్డి అన్నారు. కొత్త వీసీగా సోమవారం ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను రైతులు సాగు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు పరిశోధనలతో కూడిన విద్యను అందించేందుకు మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ వీసీ నీరజ ప్రభాకర్, రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, విజయ, నటరాజన్ శ్రీనివాసన్, లక్ష్మి నారాయణ, నాగేశ్వర్‌రావు, ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేట అర్బన్: ఎస్‌జీఎఫ్ ఖోఖో అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్దిపేట గ్రామీణ మండలం రాఘవాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హరీశ్, శివప్రసాద్, రంజిత్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుభార్గవి తెలిపారు. ఈ నెల 20న ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి విభాగంలో ముగ్గురు విద్యార్థులు ఖోఖో పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

రైతును బలి తీసుకున్న రక్షణ తీగ



కిషన్

వెల్దుర్తి: అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టూ ఏర్పాటుచేసిన ఇనుప కంచెకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వగా.. అదే ఆ రైతు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ విషాదకర ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం యశ్వంతరావుపేటలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాచపల్లి కిషన్ (55), స్వరూప దంపతులకు కుమారుడు వంశీ ఉన్నాడు. వ్యవసాయమే జీవనాధారం. పొలంలోకి అడవి పందులు దూరకుండా ఉండేందుకు చుట్టూ కంచె బిగించి దానికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చాడు. రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి కంచెకు కరెంట్ కనెక్షన్ ఇవ్వగా, సోమవారం ఉదయం దాన్ని తొలగించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగ తగిలి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు అక్కడికి వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు రోజుల్లో ఇద్దరు.. ఈ నెల 19న ఇదే గ్రామానికి చెందిన గుండెని యాదయ్య పొలం చుట్టూ ఏర్పాటుచేసిన విద్యుత్తు తీగకు తగిలి మృతి చెందిన విషయం విదితమే. అది మరువక ముందే ఈ ఘటన జరగడం గ్రామంలో విషాదాన్ని నింపింది.

విద్యుదాఘాతంతో యువరైతు...



దుర్గేశ్

హత్నూర, న్యూస్‌టుడే: అహర్నిశలు శ్రమించి పైరును కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. ఆ చేనును కోసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డారు. ఈ ఘటన హత్నూర మండలం నాగుల్‌దేవుల్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు.. నాగుల్‌దేవుల్‌పల్లికి చెందిన పడాల దుర్గేశ్(34) సన్నకారు రైతు. వానాకాలంలో తన పొలంలో వరి వేయగా కోతకొచ్చింది. తండ్రి మల్లయ్యతో కలిసి పొలానికి వెళ్లాడు. యంత్రంతో వరి కోస్తున్న క్రమంలో.. ఆ యంత్రానికి విద్యుత్తు తీగ తగిలి దుర్గేశ్‌పై పడటంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుమారుడిని.. తండ్రి స్థానికుల సహాయంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దుర్గేశ్‌కు భార్య లత, నాలుగేళ్ల కూతురు ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులోని మోటారు తీయబోయి రైతు మృతి



చంద్రం

దౌల్తాబాద్: చెరువులో ఉన్న మోటారును పైకి తీయబోయి ప్రమాదవశాత్తు నీటిలో పడి రైతు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఉప్పరపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు.. ఉప్పరపల్లికి చెందిన చంద్రం(49) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వరి పొలానికి నీరు పెట్టుకోవడానికి మోటారును చెరువులో వేశాడు. వరికి నీటి అవసరం తగ్గిపోవడంతో మోటారును పైకి తీయడానికి యత్నిస్తుండగా కాలుజారి చెరువులో పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. పొరుగు పొలం రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

మాచిన్‌పల్లిలో గుర్తుతెలియని మృతదేహం

దౌల్తాబాద్: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లిలోని ఊట చెరువులో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మాచిన్‌పల్లి అటవీ ప్రాంతంలోని ఊటచెరువులో మేకలకు నీరు తాపడానికి కాపరులు వెళ్లగా మృతదేహం నీళ్లలో తేలి ఉండటాన్ని గమనించారు. వెంటనే గ్రామస్థులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి విచారించినా ఎవరన్నది తెలియలేదన్నారు.

పాత కక్షలతో యువకుడి హత్య



అనిల్‌రాజు

సదాశివపేట, న్యూస్‌టుడే: పాత కక్షలతో యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన సదాశివపేట పట్టణంలో చోటుచేసుకొంది. సీఐ తెలిపిన వివరాలు.. మ్యాతరి అనిల్ రాజు(29) సిద్దాపూర్ ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి కాలనీకి చెందిన మరో ఇద్దరితో కలసి మద్యం తాగడానికి వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం ఉదయం స్థానిక ప్రభుత్వ నర్సరీలో యువకుడి మృతదేహం రక్తపు మడుగులో ఉందని సమాచారం అందడంతో పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. అనిల్ రాజు తల్లి ధనలక్ష్మి కాలనీలోని ముగ్గురిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ ముగ్గురితో తమ కుటుంబానికి విభేదాలు ఉన్నాయని, పాత కక్షలతో హత్య చేసి ఉంటారని పేర్కొన్నారు. పోలీసులు క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. హత్యచేసిన వారిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



లింగంచారి

పాపన్నపేట: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని పాత లింగాయిపల్లికి చెందిన కమ్మరి లింగంచారి (36), అనిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లింగంచారి 8 ఏళ్లుగా కుటుంబంతో సహా హైదరాబాద్‌లో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. దసరాకు అందరూ స్వగ్రామానికి వచ్చారు. కొన్ని నెలలుగా ఉపాధి సరిగా లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో దూలానికి ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడు సుధాకర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మనోవేదనతో మరొకరు..



రమేష్

నిజాంపేట (రామాయంపేట): ఆర్థికంగా సతమతమవుతున్న ఒకరు మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా నిజాంపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని నార్లాపూర్‌కు చెందిన బోయిని రమేష్ (32), భాగ్యలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వచ్చే కూలి డబ్బులతో కుటుంబ పోషణ భారంగా మారడంతో మనస్తాపం చెందాడు. ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి సమీపంలోని కల్వకుంట శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం గమనించారు. భాగ్యలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ట్రాక్టర్ ఢీకొని రైతు దుర్మరణం



బాలకిష్టయ్య

దుబ్బాక: అతి వేగంతో, అజాగ్రత్తగా ట్రాక్టర్ డ్రైవర్.. వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రైతు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాలు.. దుబ్బాక మండలం బల్వంతాపూర్‌కు చెందిన జంగిటి బాలకిష్టయ్య (65), లక్ష్మి దంపతులకు నలుగురు సంతానం. వ్యవసాయమే జీవనాధారం. ఆదివారం మధ్యాహ్నం బాలకిష్టయ్య ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బల్వంతాపూర్ గ్రామానికి ఓ పని నిమిత్తం బయల్దేరాడు. మార్గమధ్యలో ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి బాలకిష్టయ్య బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడికి సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం కేసు నమోదు చేశారు.

బైక్ అదుపు తప్పి వాహనదారుడు..

బెజ్జంకి: రాజీవ్ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. గోదావరిఖనికి చెందిన బోనగిరి మనోజ్(25), కొత్తగూడెంకు చెందిన జోన్ అన్విత్ ఇద్దరు మిత్రులు. కరీంనగర్‌లో అద్దె గదిలో ఉంటూ ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తున్నారు. పని నిమిత్తం కరీంనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై సిద్దిపేట వైపు బయల్దేరారు. తోటపల్లి వద్ద ప్రమాదం జరిగింది. 108 వాహనంలో ఇద్దరిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మనోజ్ మృతి చెందాడు. అన్విత్ చికిత్స పొందుతున్నాడు. ఫిర్యాదు రాగానే కేసు నమోదుచేస్తామని ఎస్సై తెలిపారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న హైందవ సోదరులు

గజ్వేల్, గజ్వేల్ గ్రామీణ: సికింద్రాబాద్ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గజ్వేల్ పట్టణంలో హైందవ సోదరులు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఠాణాలో వినతిపత్రం అందజేశారు. గజ్వేల్‌లో భాజపా రాష్ట్ర నాయకులు జస్వంత్ రెడ్డి, గజ్వేల్ పట్టణాధ్యక్షులు మనోహర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు రాములు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అంబేడ్కర్ కూడలి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా హిందువుల వ్యతిరేకిగా మారిందన్నారు. ఈ సందర్భంగా పోలీసులు, నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది.

దౌల్తాబాద్: ఆలయంలో విగ్రహం ధ్వంసం చేసినందుకు నిరసనగా దౌల్తాబాద్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హిందూ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కేటాయించండి



ఐవోసీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: లక్కీ డ్రాలో ఎంపిక చేసిన రెండు పడక గదుల ఇళ్లకు పట్టా సర్టిఫికెట్లు పంపిణీ చేసి, కేటాయించాలని సోమవారం గజ్వేల్ సమీకృత కార్యాలయం వద్ద లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంగాపూర్‌లో పేదల కోసం నిర్మించిన 1200 గృహాలకు సంబంధించి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో వచ్చిన దరఖాస్తులను పలు దఫాలుగా సర్వే చేసిన అధికారులు ఏడాది కిందట లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇంటి నంబర్లు కేటాయించారన్నారు. ఇప్పటివరకు కలెక్టరేట్ చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇళ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు రెవెన్యూ, పోలీసు సిబ్బంది నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

మిరుదొడ్డి: అన్నదాతలు ధాన్యాన్ని అమ్మేటప్పుడు దళారులను నమ్మి మోసపోవద్దని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ బాధ్యుడు చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మిరుదొడ్డి మండల కేంద్రంతోపాటు అల్వాలలో ఐకేపీ, ఏఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేంద్రాలను ప్రారంభించారు. మండలాధ్యక్షుడు రాజేశం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట అర్బన్: సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, రాయణరావుపేటలో కొనుగోలు కేంద్రాలను ఆయా శాఖల అధికారులతో కలిసి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూజల హరికృష్ణ ప్రారంభించారు. ఎంపీడీవో శ్రీరాములు, ఏపీఎంలు విజయ నిర్మల, చంద్రం, ఏవో పరశురాం రెడ్డి పాల్గొన్నారు.

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండలం రామవరం, జనగామ, గొల్లకుంట, కేశనాయక్‌తండాలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను హుస్నాబాద్ సహకార సంఘం అధ్యక్షుడు బొలిశెట్టి శివయ్య ప్రారంభించారు. ఉపాధ్యక్షుడు అయిలయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అయిలయ్య, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొండపాక గ్రామీణం: కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సిరిసినగండ్లలో సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాలనర్సయ్య అన్నారు.

నంగునూరు: పల్లెల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించి రైతుల ఇబ్బందులను తొలగించాలని భాజపా ఆధ్వర్యంలో తహసీల్దారు సరితకు వినతి పత్రం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

గుంపుగా తిరుగుతూ.. దాడులు చేస్తూ..

శునకాలు, వానరాలతో ప్రజల అవస్థలు



పట్టణంలోని 4వ వార్డులో శునకాలు

న్యూస్‌టుడే, చేర్యాల: పట్టణంలో నిత్యం శునకాలు, వానరాలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రతి కాలనీలో పదుల సంఖ్యలో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. శునకాల గుంపు వీధుల్లో కనిపిస్తే చాలు పట్టణవాసులు వణికిపోతున్నారు. గతంలో పలువురు శునకాల దాడిలో గాయపడటంతో ప్రజలు అప్రమత్తంగా ఉంటున్నారు. వానరాలు, శునకాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కథనం..

ఇవీ ఇటీవలి ఘటనలు..

- పట్టణంలోని గాంధీ కూడలి సమీపంలో ఇటీవల ఓ బాలుడు ఇంటి నుంచి బయటికి వస్తుండగా ఓ వీధి కుక్క వెంటపడింది. తప్పించుకునేందుకు పరిగెడుతుండగా ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ప్రమాదంలో బాలుడి కంటికి, భుజానికి గాయాలయ్యాయి.
- స్థానిక రైతుబజారు ఎదురుగా నివాసముంటున్న కిరాణ వ్యాపారి శేరి బాలనారాయణ కోతుల నుంచి తప్పించుకునే క్రమంలో కింద పడిపోగా కాలు విరిగింది. ఇలాంటి ఘటనలు వారానికి కనీసం మూడు, నాలుగు జరుగుతున్నాయి.

విన్నవించినా వినేవారేరీ?

ప్రతి నిత్యం వానరాలు, కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఎవరైనా ఒంటరిగా బయట తిరిగితే బెదిరిస్తున్నాయి. భయపడి పారిపోయే క్రమంలో కొందరు కిందపడి గాయాల పాలవుతున్నారు. చేతిలో కర్ర ఉంటేనే ఇంటి ముంగిట పనులు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. కొందరైతే జాలీలతో రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంటి ఆవరణలో పూలమొక్కలు, కూరగాయల మొక్కలు, పండ్ల చెట్లు పెంచడం మానేశారు. మున్సిపాలిటీ అధికారులు, పాలక వర్గానికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. కోతులు, కుక్కల సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పుర కమిషనరు నాగేందర్ మాట్లాడుతూ.. కోతుల సమస్యపై అటవీ శాఖ అధికారులతో మాట్లాడామని, కుక్కల నియంత్రణకు కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.



చేర్యాల వ్యవసాయ మార్కెట్ ఎదురు వీధిలో వానరాలు..

'సకల వసతులు కల్పించామనడం అవాస్తవం'

గజ్వేల్: సకల వసతులతో ఇళ్లు నిర్మించి, రవాణా ఛార్జీలు రూ.50 వేలు ఇచ్చామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పటం అవాస్తమని మల్లన్నసాగర్ నిర్వాసితులు, కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం గజ్వేల్‌లోని ఆర్ అండ్‌ఆర్ కాలనీలో హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. గజ్వేల్ ఏఎంసీ వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్, నిర్వాసితులు మాట్లాడుతూ.. ఇప్పటికీ కాలనీలో శ్మశానవాటిక నిర్మించలేదన్నారు.

ప్రజల సహకారంతోనే పల్లెల అభివృద్ధి: డీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో దేవకిదేవి

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం): ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి అన్నారు. సోమవారం అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలతో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, గ్రామ పంచాయతీ, మీసేవా కేంద్రాలు తదితర అంశాల్లో గ్రామస్థులకు అందించే సేవల గురించి అవగాహన కల్పించారు. సుపరిపాలన విభాగంలో ఈ గ్రామాన్ని ఉత్తమ పంచాయతీ కోసం ప్రతిపాదించడం అభినందనీయమన్నారు. ఎంపీడీవో బానోతు జయరాం, డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో గుగులోతు మోహన్, మాజీ సర్పంచి అశోక్‌రెడ్డి, ఏపీవో ప్రభాకర్, ఏపీఎం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చేయూతనందించి.. రోడ్డు దాటించి



సిద్దిపేట టౌన్: అన్ని అవయవాలు సంక్రమంగా ఉన్నవాళ్లే ట్రాఫిక్‌లో రోడ్డు దాటేందుకు నానా అవస్థలు పడుతుంటారు. అలాంటిది వృద్ధుడైన ఓ దివ్యాంగుడి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. సిద్దిపేటలోని విక్టరీ థియేటర్ చౌరస్తా వద్ద సోమవారం ఓ వృద్ధుడు నడవలేని స్థితిలో రోడ్డు దాటుతుండగా గమనించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజేశ్ చేయూతనందించి రోడ్డు దాటించాడు. స్థానికులు కానిస్టేబుల్‌ను అభినందించారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షురాలి ఎన్నిక

చేర్యాల, న్యూస్‌టుడే: మున్నూరుకాపు మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా చేర్యాల పట్టణానికి చెందిన తాడెం రంజిత సోమవారం ఎన్నికయ్యారు. హైదరాబాద్ బర్కత్‌పురాలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు వి.ప్రకాశం చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు ఆమె తెలిపారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టాలి: సీపీఐ

గజ్వేల్: సీసీఐ(భారత పత్తి సంస్థ) కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టు దయానందరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన సోమవారం గజ్వేల్‌లో మాట్లాడుతూ పత్తి, వరి పంటలు చేతికొచ్చినా విక్రయించుకునేందుకు కేంద్రాలు లేవన్నారు. ప్రభుత్వం వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లు చేపట్టాలన్నారు. లేకుంటే పత్తి రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివలింగ కృష్ణ, నాయకులు రాజేశం, తదితరులున్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని పత్తిమార్కెట్ యార్డులో వర్షానికి తడిచిన ధాన్యాన్ని మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పాల సాయిరాం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడారు. గన్నీసంచులు లేకపోవటంతోనే వర్షానికి వరి, మొక్కజొన్న తడిచిపోయాయని ఆరోపించారు. ధాన్యం, మక్కలు కొనుగోళ్లకు సిద్ధంగా ఉన్నప్పటికీ గన్నీసంచులు లేకపోవటంతో ఈ పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిచిన ధాన్యం, మొక్కజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. భారాస నాయకులు ఎల్లారెడ్డి, ఎల్లయ్య, నర్సింలు, ఆంజనేయులు, శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి పుస్తకాన్ని అందిస్తున్న మామిడాల శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైందని, దాన్ని జయిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మానసిక, వ్యక్తిత్వ వికాస నిపుణుడు మామిడాల శ్రీనివాస్ అన్నారు. మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేట సమీకృత కలెక్టర్ కార్యాలయంలో స్ఫూర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం 'మానసిక ఆరోగ్యం-ఒత్తిడిని జయించడం ఎలా' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఒత్తిడితో చేసే పనుల్లో నాణ్యత లోపిస్తుందని ఇది ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేస్తుందన్నారు. డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీవో జయదేవ్‌ఆర్య, స్ఫూర్తి లయన్స్ క్లబ్ జన్ ఛైర్మన్ మామిడాల సత్యానందం, ప్రతినిధులు పాల్గొన్నారు.

వైకుంఠధామం పరిశీలన

దుబ్బాక: పురపాలికలోని లచ్చపేట 11వ వార్డులో 'అసంపూర్తిగా వైకుంఠధామం' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పుర కమిషనర్ కె.రమేశ్‌కుమార్ స్పందించారు. వైకుంఠధామాన్ని పరిశీలించి పనుల పూర్తికి అవసరమైన నిధుల మంజూరుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. త్వరలోనే వైకుంఠధామం అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం 10వ వార్డులో పనులు పూర్తయి ప్రారంభానికి నోచుకోని డీఆర్‌సీసీ కేంద్రం, వర్మి కంపోస్టు తయారీ కేంద్రాన్ని పరిశీలించి త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ బుస్స ప్రవీణ్, పారిశుద్ధ్య అధికారి దిలీప్, నాయకులు నందాల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో సిద్దిపేట విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట టౌన్: హైదరాబాద్‌లో ఎస్‌ఎఫ్‌ఏ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో సిద్దిపేటకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. పట్టణానికి చెందిన జపాన్ కరాటే షోటోకాన్ ఫెడరేషన్‌కు చెందిన మీర్జా అబ్దుల్‌ఆహాద్‌అలీబేగ్ అండర్-11 విభాగంలో కటా అంశంలో స్వర్ణ పతకం, అండర్-11 బాలికల విభాగంలో అరిభహూనైన్ స్వర్ణం, అండర్-15 బాలికల విభాగంలో ఆస్మా తరానమ్ రజత పతకాలు సాధించారని కరాటే శిక్షకుడు పాషా వెల్లడించారు.

హామీల అమలులో విఫలం: సీపీఎం

చేర్యాల(ధూళిమిట్ట): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోపాలస్వామి విమర్శించారు. ధూళిమిట్ట మండలం జాలపల్లిలో సోమవారం పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఏదో సమస్యను సృష్టించి, ప్రజల దృష్టిని మళ్లిస్తూ, ప్రభుత్వాలు కాలం వెళ్లదీస్తున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గమని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్, పొత్తిరెడ్డి రాజు, బుచ్చయ్య, కనకయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోప నివారణపై అవగాహన



కరపత్రాలతో వైద్యాధికారులు

కొండపాక గ్రామీణం: ప్రపంచ అయోడిన్ లోప దినోత్సవం పురస్కరించుకొని సోమవారం కొండపాక మండలం కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పులే బాలుర గురుకుల పాఠశాలలో జిల్లా వైద్యాధికారులు డా.ఆనంద్, డా.నారాయణరావు అయోడిన్ లోప రుగ్మతల నివారణకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అయోడిన్ మూలకం శారీరక, మానసిక ఎదుగుదలకు ముఖ్యమని తెలిపారు. మండల వైద్యాధికారి శ్రీధర్, వైద్యసిబ్బంది రాజేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మల్లన్నసాగర్‌తో రైతులకు లబ్ధి: భారాస

గజ్వేల్: మల్లన్నసాగర్ నిర్వాసితులకు భారాస ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై వాస్తవాలు చెపితే కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని గజ్వేల్ ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. ఆయన సోమవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ నిర్మాణంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నిర్వాసితులకు కేసీఆర్ 90 శాతం సౌకర్యాలు కల్పించారని, మిగిలిన సౌకర్యాలు కల్పించకుండా హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేయించడం సరికాదన్నారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పాల రమేశ్ గౌడ్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు హైమద్ తదితరులున్నారు.

'రైతుబంధు నిధుల దుర్వినియోగం'

కొండపాక గ్రామీణం: భారాస నాయకులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయడం సరికాదని జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు ఐలయ్య అన్నారు. సోమవారం కుకునూరుపల్లిలో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో సాగు చేయని భూములకు రైతుబంధు నిధులు జమచేసి గత భారాస ప్రభుత్వం నిధులను దుర్వినియోగం చేసిందని అన్నారు. కరుణాకర్, రుషి, నరసింహాచారి, తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం: రైతులకు భారాస ప్రభుత్వం చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల అధ్యక్షులు బంక చందు, జంగపల్లి అయిలయ్య సోమవారం అన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వర్గల్, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారం, నగదు ఎత్తుకెళ్లిన ఘటన వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపిన వివరాలు.. తిమ్మాయిపల్లి మల్లేష్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం బంధువుల ఇంటికి గజ్వేల్ వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.75,000 నగదు, 5గ్రా. బంగారం, 150 గ్రా. వెండి మాణిక్యాలు ఎత్తుకెళ్లారని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీంతో అక్కడికి చేరుకున్న గౌరారం ఎస్సై వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాయపోల్: రాయపోల్‌లోని వైన్స్‌లో ఆదివారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి రూ.40వేల నగదుతో పాటు రెండు మందు బాటిళ్లు, సీసీ కెమెరా డీవీఆర్‌లను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు దుకాణ యజమాని బబ్బూరి మల్లేశం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ దేవయ్య తెలిపారు. తొగుట సీఐ లతీఫ్ సంఘటనా స్థలానికి వచ్చి క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

మద్యం తాగి పట్టుబడిన వారికి జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు సోమవారం సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా 17 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ.29,500 జరిమానా విధించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోహెడ గ్రామీణం, న్యూస్‌టుడే: కోహెడ మండలంలోని నారాయణపూర్ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. సోమవారం ఉదయం వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో అక్కడికి వెళ్లగా ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టరును దారి పక్కన నిలిపి డ్రైవర్ పరారయ్యాడు. ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్ వివరాలు సేకరించగా అదే గ్రామానికి చెందిన రాజుకు చెందినదిగా గుర్తించారు.



హుస్నాబాద్‌లో పాల్గొన్న ఏసీపీ సతీశ్, తదితరులు



మద్దూరులో నినాదాలు చేస్తున్న పోలీసులు, విద్యార్థులు



రాయపోల్‌లో రోగులకు పండ్లు పంపిణీ

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం



చేర్యాల: నేతాజీ కూడలిలో నివాళులర్పిస్తున్న సీఐ శ్రీను, ఎస్సై నీరేశ్, సిబ్బంది

హుస్నాబాద్, చేర్యాల, రాయపోల్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరులైన పోలీసులకు అండగా ఉంటామని, వారిని స్మరించుకోవడానికి వారోత్సవాలను నిర్వహిస్తున్నామని హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హుస్నాబాద్ ఠాణా ఆవరణలో ఎస్ఐ జాన్‌విల్సన్ విగ్రహానికి, సీఐ యాదగిరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బల్దియా ఉపాధ్యక్షురాలు అనిత, సీఐ కొంద్రు శ్రీనివాస్, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ ఎస్ఐలు పాల్గొన్నారు. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లిలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సంస్మరణోత్సవాలను నిర్వహించి శాంతి ర్యాలీలు తీశారు. రాయపోల్ పోలీసు అమరవీరుల స్తూపం చిత్రపటానికి సిద్దిపేట జిల్లా బీజేపీ ఎక్స్ ఆర్మీ సెల్ కన్వీనర్ నీల చంద్రం నివాళులర్పించి, స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఏఎస్ఐ దేవయ్య, పోలీసు సిబ్బంది, భాజపా నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం

కోహెడ, కోహెడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఛైర్మన్‌గా నిర్మల(వరికోలు) వైస్ ఛైర్మన్‌గా బీరెడ్డి తిరుపతి రెడ్డి(...)లను నియమించారు. సభ్యులుగా ఎండీ అంకూస్, చింతలపల్లి జనార్దన్‌రెడ్డి, మోటం విజయ్, తదితరులను నియమించారు.

'మహిళా శక్తి'తో ఆర్థిక భరోసా



మహిళలకు పెరటి కోళ్లను అందిస్తున్న ఐకేపీ ఏపీఎం కిషన్

రాయపోల్, న్యూస్‌టుడే: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'మహిళా శక్తి' పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని రాయపోల్ ఏపీఎం కిషన్ అన్నారు. మహిళా శక్తిలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామానికి 50 కోళ్ల చొప్పున మొత్తం 1,100 కోళ్లను, ఒక్కో కోడికి రూ.105 చెల్లించిన మహిళలకు సోమవారం పంపిణీ చేశామన్నారు. సీసీలు కిష్టయ్య, రాజేశ్వరరావు, రవీందర్, ప్రవీణ్, రోజా గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట: సిద్దిపేట యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి మగ్గం వర్క్స్-బోటిక్ మేనేజ్‌మెంట్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూబీఐ ప్రాంతీయ అధిపతి ఈద వికాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 30 రోజుల పాటు తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 - 40 ఏళ్లలోపు మహిళలు ఆధార్, రేషన్ కార్డు ప్రతులు, బ్యాంకు పాస్‌పుస్తకం, విద్యార్హతను తెలిపే ధ్రువపత్రాల ప్రతులు, మూడు ఫొటోలతో సహా ఈ నెల 24వ తేదీలోపు శిక్షణా సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు చరవాణి నం.93467 30388 సంప్రదించాలని సూచించారు.

కరవు భృతిని తక్షణమే విడుదల చేయండి

సిద్దిపేట అర్బన్: విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కరవు భృతిని వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అమ్మన చంద్రారెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు. కృష్ణమూర్తి, బాలయ్య తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జంకి, న్యూస్‌టుడే: బెజ్జంకి క్రాసింగ్ గ్రామానికి చెందిన బింగి స్వామి(43) రెండు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. మృతికి సంతాపం వ్యక్తం చేసి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, తదితరులు పాల్గొన్నారు.


అర్హులందరికీ 'గృహజ్యోతి' వర్తింపజేస్తాం



మాట్లాడుతున్న బల్దియా అధ్యక్షురాలు మంజుల, చిత్రంలో కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్: మున్సిపల్ పరిధిలో అర్హులందరికీ 'గృహజ్యోతి' పథకం వర్తింపజేస్తామని బల్దియా అధ్యక్షురాలు కడవేర్గు మంజుల అన్నారు. ఇందుకోసం బల్దియా, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సిద్దిపేటలోని పురపాలికలో గృహజ్యోతి పథకంపై మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, విద్యుత్ శాఖ ఏడీ సుధాకర్‌రెడ్డితో కలిసి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అద్దె గృహాల్లో నివసించే వారు ఇళ్లు మారితే వెంటనే సంబంధిత ధ్రువపత్రాలను బల్దియా, విద్యుత్ శాఖ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆప్షన్ రాగానే నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో బల్దియా ఉపాధ్యక్షుడు కనకరాజు, కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధూమపాన రహిత సమాజ నిర్మాణానికి కృషి



అక్కన్నపేటలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం): ధూమపాన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అక్కన్నపేట పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ బాబూరావు అన్నారు. సోమవారం అక్కన్నపేటలో ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం, జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. అంతకు ముందు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు కొత్తగా వచ్చిన పుస్తకాలను వైద్యాధికారి రమ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం షరీనా, ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి పాల్గొన్నారు.